క్లుప్తంగా

కమ్మ సేవా సమితి అధ్యక్షుడిగా బిక్కసాని



చుంచుపల్లి: కొత్తగూడెం కమ్మ సేవా సమితి అధ్యక్షుడిగా బిక్కసాని నాగేశ్వర రావు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు కొనసాగుతున్న పాత కమిటీ పదవీకాలం ముగియడంతో కొత్త కమిటీని ఎన్నుకున్నారు.

13న పెద్దమ్మగుడిలో బహిరంగ వేలంపాట

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలోని నాలుగు వ్యాపారదుకాణాలకు, మూడేళ్లకుగాను, తలనీలాలు సేకరించుకునేందుకు, చీరలు పోగుచేసుకునేందుకు, ఆలయ ప్రాంగణంలో పూలదండలు విక్రయించుకునేందుకు, ఫొటోలు తీసుకునేందుకుగాను ఏడాది కాలంపాటు లైసెన్స్ హక్కులు పొందడానికిగాను టెండర్ కం, బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం1.30 గంటల వరకు రూ.200 చెల్లించి దేవస్థానం కార్యాలయంలో షెడ్యూల్ పొందవచ్చన్నారు.

గ్యాస్ వినియోగదారులు కేవైసీ చేసుకోవాలి

పాల్వంచరూరల్: కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశాల మేరకు వంట గ్యాస్ వినియోగదారులు ఈనెల 31లోగా కేవైసీ పూర్తి చేయాలని వినియోగదారులను పాల్వంచ హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ అనంతుల లక్ష్మీనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా వంట గ్యాస్‌ను రూ.500 అందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ స్కీమ్ ఈనెల నుంచి ప్రారంభమైంది. దీనికి కూడా కేవైసీ అవసరమేనన్నారు. తెల్లరేషన్ కార్డు ఉండి గ్యాస్ కనెక్షన్ ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. అయితే గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బు చెల్లించి, ఆ తర్వాత సబ్సిడీ రూపంలో డబ్బులను తిరిగి వినియోగదారుని ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు.

వితరణ



బియ్యం అందజేస్తున్న లక్ష్మణ్‌నాయక్

టేకులపల్లి: తడికలపూడి పంచాయతీ కోక్యా తండాకు చెందిన రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద గుగులోత్ రాములు నాయక్ ఈనెల 3న అనారోగ్యంతో మృతి చెందాడు. కూలి పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించేవాడు. సోమవారం కర్మలు కావడంతో గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ధరావత్ లక్ష్మణ్ నాయక్ ఆదివారం 50 కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశాడు. కార్యక్రమంలో గుగులోత్ కన్నెరాం, జి.బాలాజీ, జి.రాహుల్, బీ.గోపాల్, డి.శంకర్, ఎం.నరేందర్, బీ కోట తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు



రేగులగూడెంలో గ్రామసభ

పాల్వంచరూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2023–2024 సంవత్సరానికి సంబంధించిన పనులకు 15వ సామాజిక తనిఖీ గ్రామసభలు ఆదివారం మండలంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు చంద్రాలగూడెం, రేగులగూడెం, లక్ష్మీదేవిపల్లి, బంజర, పాయకారి యానంబైల్, కారెగట్టు గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సీఎం స్పందించాలి

సింగరేణి(కొత్తగూడెం): నేడు భద్రాచలం పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి.. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై స్పందించాలని, ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్ద బోయిన సతీష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నకాలంలో పాదయాత్రగా భద్రాచలం, ఇల్లెందు, మణుగూరు పర్యటనకు వచ్చిన సందర్భంలో మా (కాంగ్రెస్) ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చర్చించి వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

ఫలితమివ్వని శిక్షణ కేంద్రం

- అనువైన నిర్మాణం.. మార్పుతో మరింత ప్రయోజనం
- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మార్చాలని యువత విన్నపం



ఇల్లెందులోని యువజన శిక్షణ కేంద్రం

ఇల్లెందురూరల్: దక్షిణ భారతదేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి పుట్టినిల్లు ఇల్లెందు. అంతటి గొప్పతనం కలిగిన ఉన్న ఈ ప్రాంతంలో ఉపాధి వనరుల లేక యువతకు ఏం చేయాలో దిక్కు తోచడం లేదు. వీరిలో కొందరు ఆటోలు నడుపుకుంటుండగా మరికొందరు చిరు వ్యాపారలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇంకొందరు డబ్బు ఆశతో అడ్డదారులు తొక్కుతూ మత్తు మందుల విక్రయం, దొంగతనాలు వంటి చెడుమార్గంలో పయనిస్తున్నారు. ఇటువంటి వాటికి బానిస కాకుండా యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాల్సిన బాధ్యత పాలకులు, ప్రభుత్వాలపై ఉంది. కానీ ఆ దిశగా మాటలు చెబుతున్న పాలకులు ఆచరణలో మాత్రం ప్రయత్నాలు చేసిన దాఖలాలు అంతగా లేవనే చెప్పాలి. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో నెలకొల్పిన యువజన శిక్షణ కేంద్రం అనతికాలంలోనే ఉత్సవ విగ్రహంగా మారింది. దీంతో యువత నిరాశ చెందుతున్నారు.

భారీ హంగులతో నిర్మాణం...

ఇల్లెందుకు సమీపంలో సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలో రూ.20 కోట్ల వ్యయంతో 2012లో యువజన శిక్షణ కేంద్రాన్ని ఐటీడీఏ పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వం నిర్మించింది. ఏకకాలంలో మూడు, నాలుగు బ్యాచ్‌లకు పలు అంశాలపై వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా విశాలంగా తరగతి గదులు, డిజిటల్ తరగతి గదులు, ప్రొజెక్టర్ల ఏర్పాటు, కంప్యూటర్ ల్యాబ్, వసతి గదులు ఇలా అనేక సౌకర్యాలతో యువజన శిక్షణ కేంద్రం రూపుదిద్దుకుంది.

ప్రారంభంలో వరుస శిక్షణలు..

యువజన శిక్షణ కేంద్రం ప్రారంభించిన కొత్తలో కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, మేషన్, టైలరింగ్, బైక్ మెకానిక్ తదితర విభాగాలలో శిక్షణ ఇచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. కానీ యువజన శిక్షణ కేంద్రాల నిర్వహణను ఐటీడీఏ ఉన్నతాధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించడంతో కేంద్రాల ఏర్పాటు లక్ష్యం పక్కదారి పట్టిందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. కేంద్రంలో పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు చూపి వారికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లుగా రికార్డులలో నమోదు చేసుకొని ప్రభుత్వానికి నివేదించడం.. రాయితీ పొందడం జరుగుతూ వస్తోంది. వాస్తవంగా ఏ ఒక్కరికీ ఉపాధి అవకాశాలు లభించలేదని శిక్షణ పొందిన యువకులే బహిరంగంగా చెబుతున్నారు. నాటి నుంచి అరకొరకగా.. నామమాత్రపు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ భారీ ఖర్చుతో నిర్మించిన యువజన శిక్షణ కేంద్రాన్ని నిరుపయోగంగా మార్చారు.

సభలు.. సమావేశాలు.. శిక్షణలు

ఐటీడీఏ పర్యవేక్షణలో కొనసాగిన యువజన శిక్షణ కేంద్రాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగించడంతో క్రమంగా నిర్వీర్యమవుతూ వచ్చింది. చివరకు కుల సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల సమావేశాలు, సభలు, ఉపాధ్యాయుల శిక్షణ, అభినందన సమావేశాలకే పరిమితమవుతోంది. యువజన శిక్షణ కేంద్రంలో శిక్షణ శిబిరాల నిర్వహణ క్రమంగా తగ్గుముఖం పట్టడంతో ప్రాంగణంలోని గదులు, విలువైన సామగ్రి పాడైపోయే పరిస్థితి నెలకొంది.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా మారిస్తే...

ప్రతి ఐటీఐ కళాశాలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. భద్రాచలం ఏజెన్సీలో అతిపెద్ద సబ్ డివిజన్ అయిన ఇల్లెందులో కారణం ఏదైనా ప్రభుత్వ ఐటీఐ ఒక్కటీ నెలకొల్పలేదు. ఫలితంగా యువత సాధారణ విద్యకే పరిమితమై సాంకేతిక విద్య, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇల్లెందులో నిరుపయోగంగా మారుతున్న యువజన శిక్షణ కేంద్రాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా తీర్చిదిద్ది కొద్దిపాటి హంగులు, సౌకర్యాలు కల్పిస్తే ఏజెన్సీలో గిరిజన యువతకు ఉపాధి కల్పన కేంద్రంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఉపాధి కేంద్రంగా తీర్చిదిద్దాలి...



సుదిమళ్ల గ్రామపంచాయతీ పరిధిలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన యువజన శిక్షణ కేంద్రాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా ఆధునీకరించాలి. శిక్షణకు అనువైన నిర్మాణం కలిగి ఉన్న యువజన శిక్షణ కేంద్రంలో యువతకు మెరుగైన శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన కేంద్రంగా తీర్చిదిద్దాలి.

– విజయ్, విజయలక్ష్మీనగర్, ఇల్లెందు మండలం

అవకాశాలు కల్పించాలి...



సాంకేతిక రంగంలో, వృత్తి విద్యలో మెళకువలను మెరుగు పర్చుకునేందుకు ఇల్లెందు ఏజెన్సీలో యువతకు ఎలాంటి అవకాశాలు లేవు. యువజన శిక్షణ కేంద్రం నిర్మించినా ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ప్రభుత్వం స్పందించి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌గా తీర్చిదిద్దాలి.

– భట్టు రమేష్, ఇందిరానగర్, ఇల్లెందు మండలం

పల్లెల్లో వసతులు మెరుగుపరుస్తాం..



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రతీ పల్లెలో కనీస సౌకర్యాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని రేపల్లెవాడ, చల్లసముద్రం, బోయితండా, ఇందిరానగర్, బాలాజీనగర్, రాఘబోయినగూడెం, సుభాష్‌నగర్, సుదిమళ్ల గ్రామపంచాయతీలలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.1.50 కోట్ల వ్యయంతో సీసీ రహదారుల నిర్మాణం కోసం ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, రూ.500లకే వంట గ్యాస్ ప్రస్తుతం అమలవుతున్నాయని చెప్పారు. ఎవరికైనా అర్హత ఉండి జీరో విద్యుత్ బిల్లు రానిపక్షంలో ఆందోళన చెందకుండా మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి మరోసారి ఆన్‌లైన్ చేయించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవెంత్‌రెడ్డి జిల్లాలోనే ప్రారంభిస్తారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతీఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, బియ్యని రజిని, బానోత్ రోజా, బోడ సుమలత, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణ, ఏఈ రాజు, కాంగ్రెస్ నాయకులు మూతి కృష్ణ, సూర్నపాక సత్యనారాయణ, గుగులోత్ నాగార్జున్, పోటు రవి, తాటి భిక్షం, బానోత్ రాంబాబు, పాయం స్వాతి, కల్తి పద్మ, పాయం లలిత, శారద పాల్గొన్నారు.

పార్క్‌ను సందర్శించిన న్యాయమూర్తులు



పార్క్‌లో న్యాయమూర్తులు

ఇల్లెందురూరల్: అటవీశాఖ ఆధ్వర్యంలో తీర్చిదిద్దిన నేచర్ పార్క్ సుందర ప్రదేశంగా ఉందని పలువురు న్యాయమూర్తులు ప్రశంసించారు. మండలంలోని సుభాష్‌నగర్ నేచర్ పార్క్‌ను భద్రాచలం న్యాయమూర్తి సూరిరెడ్డి, కొత్తగూడెం న్యాయమూర్తి శివనాయక్, కరీంనగర్ న్యాయమూర్తి రాజేశ్వర్, దేవరకొండ న్యాయమూర్తి హరీష్ ఆదివారం సందర్శించారు.

పార్క్ మొత్తం కలియతిరిగారు. పలుచోట్ల సహజ సిద్ధంగా ఉండేలా తీర్చిదిద్దిన మొక్కలను తిలకించి ముగ్ధులయ్యారు. ఎఫ్‌డీఓ వెంకన్న వారికి పార్క్ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు గూడు కల్పించిన చరిత్ర సీపీఐదే



ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలోని పాత కొత్తగూడెం డబుల్ బెడ్ రూమ్‌ల వద్ద ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా 12వ తేదీన 800 మంది పేదలకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తెలిపారు. ఆదివారం పాత కొత్తగూడెంలోని ఇళ్ల స్థలాలను ఆయన పరిశీలించారు. మాట్లాడుతూ... కొత్తగూడెం నియోజకవర్గంలో వేలాది మంది నిరుపేదలకు గూడు కల్పించిన చరిత్ర సీపీఐదేనని, నియోజకవర్గంలో అనేక కాలనీలు ఏర్పాటు చేసి 20 వేల కుటుంబాలకు గూడు నిలబెట్టిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు. పోరాటాల ద్వారానే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వేలాది మంది గూడులేని నిరుపేదలను సమీకరించి ప్రభుత్వాలపై పోరాటాలు చేయడం ద్వారానే పేదోడి ఇంటి కల నిజమవుతుందని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కాకర్లలో సంపును పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మిషన్ భగీరథ సీఈ కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కాకర్ల గ్రామంలో చేపట్టిన నీటి సంపు నిర్మాణ పనులను సీఈ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నీటి సంపు నిర్మాణ పనుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దుబ్బతండా, మొద్దులగూడెం, శంభునిగూడెం, కాకర్ల గ్రామాల్లోని మిషన్ భగీరథ ట్యాంకులకు నీళ్లు ఎక్కకపోవడంతో తలెత్తిన సమస్య పరిష్కారం కోసం రూ.20 లక్షలతో నీటి సంపు, పైపులైన్ నిర్మించడం జరిగిందన్నారు. ఆయా పనులు పూర్తయ్యాయని, ఈనెల 16 లేదా 17న మిషన్ భగీరథ నీటిని ఆయా గ్రామాలకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ డి.హరి, ఎల్ఎన్‌టీ మంగీలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్లు లేక అవస్థలు



సుజాతనగర్ మండల కేంద్రం

సుజాతనగర్: సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రజా మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక వ్యాపారులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం ప్రతి నిత్యం మండల కేంద్రానికి వస్తుంటారు. వందల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుండంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వినియోగదారులతో ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. కూరగాయలు, నిత్యావసర, ఇతరత్రా సరుకులను ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విక్రయిస్తుంటారు. ఈ క్రమలో టాయిలెట్ల సౌకర్యం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. స్వచ్ఛత పాటించాలని ప్రభుత్వాలు చెబుతున్నా మండల కేంద్రంలో మూత్రశాలలు, పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఏ అధికారి, ప్రజాప్రతినిధులకు ఆలోచన రాకపోవడమేంటోనని ప్రయాణిలు, వ్యాపారులు వాపోతున్నారు.

జీఎం జాన్‌ఆనంద్‌కు సన్మానం



జీఎం జాన్‌ఆనంద్‌ను సత్కరిస్తున్న అధికారుల సంఘం సభ్యులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి ఇల్లెందు ఏరియాకు కేటాయించిన రూ.40 లక్షల టన్నుల ఉత్పత్తిని 23 రోజుల ముందుగానే అధిగమించినందుకు ఏరియా జనరల్ మేనేజర్ జాన్ ఆనంద్‌ను ఇల్లెందు ఏరియా అధికారుల సంఘం ఘనంగా అభినందించింది. ఆదివారం జీఎం కార్యాలయంలో జీఎం జాన్‌ఆనంద్‌ను కలిసిన వారు పుష్పగుచ్ఛం అందజేసి శాలువ కప్పి సత్కరించారు. ఎస్‌ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ... మార్చి 2024 నాటికి ఇల్లెందు ఏరియాకు కేటాయించిన 112శాతం ఉత్పత్తి లక్ష్య సాధనలో ఉద్యోగులు, అధికారులను సమన్వయపర్చుతూ ముందుకు సాగారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు నర్సింహరాజు, చిన్నయ్య, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, యూనస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

పాల్వంచరూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించడానికి తొలిసారిగా సోమవారం జిల్లా పర్యటనకు వస్తున్నారని, మణుగూరులో నిర్వహించే బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, అధిక సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సభకు వెళ్లేందుకు పాల్వంచ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మురళి, విజయ్, ఉపేందర్, రాంబాబు, రంజిత్, సోమయ్య పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

పాల్వంచరూరల్: కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లోని సైనిక స్కూల్ పాఠశాలల్లో 2024–2025 విద్యా సంవత్సరం 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల కళాశాలలో ఆదివారం జరిగింది. 6వ తరగతి విద్యార్థులు 138మందికి గాను 15మంది గైర్హాజరు కాగా, ఇంటర్ ప్రవేశానికి 97మంది గాను 11మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ దుర్గ తెలిపారు.

వేతనం ఇవ్వండి

జూలూరుపాడు: ఆలయాల్లో ధూపదీప నైవేద్య పూజలు నిర్వహించే పూజారులు, చర్చి, మజీద్‌ల్లో ప్రార్థనలు చేసే పాస్టర్లు, మౌలాసాహెబ్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... పూజారులు, పాస్టర్లు, మౌలాసాహెబ్‌లను గుర్తించి వారికి నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పోతురాజు మల్లయ్య, ఎస్.ప్రవీణ్, పి.శ్యామ్, ఎం.అరవింద్ పాల్గొన్నారు.

‘పది’ విద్యార్థులకు వీడ్కోలు



బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లెందు: పట్టణంలోని మార్గదర్శిని ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఆదివారం కోర్టు ఏరియాలోని మార్గదర్శిని బ్రాంచిలో ఏర్పాటు చేసిన సభలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రతీ విద్యార్థి చదువుతో పాటు ఆటపాటల మీద దృష్టి సారించాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రతీ విద్యార్థి పదికి పది పాయింట్లు సాధించాలని, అప్పుడే గడిచిన పదేళ్ల కష్టానికి ప్రతిఫలం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్గదర్శిని డైరెక్టర్ యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నాణ్యమైన విద్యతోనే బంగారు భవిష్యత్



డ్యాన్స్ వేస్తున్న చిన్నారులు

పాల్వంచ: నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని కేటీపీఎస్ 7వ దశ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ విద్యా స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయని, లక్ష్యం దిశగా కృషి చేస్తే అనుకున్న ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థులు పట్టుదల వదలకుండా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈ జె.శ్రీనివాస్, పాఠశాల సీఈఓ చైతన్య కృష్ణ, ప్రిన్సిపాల్ రమ్య పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేయనున్న టీచర్లకు సన్మానం



టీచర్లను సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కేశవాపురం వద్ద గల ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఈ సంవత్సరం ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, వై.శ్రీదేవి, రత్నకుమారి, పద్మావతి, వెంకటనర్సమ్మలతోపాటు అంతర్జాతీయ క్రీడాకారిణి సింధుతపస్వీ, టీఎస్ పీఆర్‌టీయూ గౌరవ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. పీఆర్‌టీయూ మహిళా అధ్యక్షురాలు ప్రభావతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, మండల అధ్యక్షుడు సంగమేశ్వరరావు, కిరణ్‌కుమార్, ప్రభావతి, కరుణకుమారి, వెంకటేశ్వరరెడ్డి, పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళి



ఇల్లెందు: పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం



సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు



పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో...

ఇల్లెందు: మహిళలకు చదువు, సంస్కారం నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి గణేష్ అన్నారు. సావిత్రిబాయి పూలే 125వ వర్ధంతి సందర్భంగా ఇల్లెందులో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా, సామాజిక విప్లవకారిణిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. నరేష్, సాయి, సిద్ధు, సంతోష్, వీరబాబు పాల్గొన్నారు.

జూలూరుపాడు: సావిత్రిబాయి పూలే 125వ వర్ధంతిని జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూలూరుపాడులో నిర్వహించారు. అంబేడ్కర్ కాలనీలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జేపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇడుపుల రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ... స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మందా కృష్ణ, సంతాపురపు ప్రవీణ్, మందా సురేష్, పోతురాజు వంశీ, కొప్పుల సాంబ, కంచపోగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం సాయిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ల సంఘం అధ్యక్షుడు, వెంకటపుల్లయ్య, డాక్టర్ పి.విజయ్‌కుమార్ సాయిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాషా, మంగ్యా, బి.కృష్ణ, సంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం అంబేద్కర్ భవన్ (మాదిగ సంక్షేమ సంఘం) ఆధ్వర్యంలో ఆదివారం భారతదేశ ప్రథమ ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా కన్వీనర్ కొయ్యాడ వెంకన్న, బరిగెల భూపేష్, సామర్ల సమ్మయ్య, మాతంగి లింగయ్య, ఆవునూరి సంజీవరావు, కొత్తురి మదనయ్య, ఇల్లందుల దుర్గయ్య, అన్నవరం, మద్దికుంట గణేష్, నమిల్ల మధు తదితరులు పాల్గొన్నారు.